క్లుప్తంగా

నిత్యావసరాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చీకటీగల పాలెం గ్రామ ఎస్టీ కాలనీలో వినుకొండ చర్చి ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు ఎం.డి.రాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో నిరుపేదలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.ప్రవళిక, ట్రెజరర్ రమేష్‌బాబు, సభ్యులు ఎన్. బ్రహ్మయ్య, టి.వెంకటకృష్ణ, గ్రామపెద్దలు నారాయణ, సాగర్, సాయి పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు మంజూరు

నాదెండ్ల: మండలంలో మూడు రైతు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు మూడు ట్రాక్టర్లు మంజూరైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. జూన్ 2వ తేదీన గుంటూరు మిర్చియార్డులో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా ట్రాక్టర్లు అందుకోనున్నారు. తూబాడులోని వై.ఎస్.జగనన్న రైతు సంఘానికి, కనపర్రులోని భారతీ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌కు, సాతులూరు-1 రెడ్డి పేరంటాలమ్మ తల్లి హైరింగ్ సెంటర్‌కు మంజూరయ్యాయి. మొత్తం రూ.6.50 లక్షలు కాగా, 10 శాతం రైతుల వాటా, మరో 50 శాతం బ్యాంకు లోను, 40 శాతం సబ్సిడీ రూపంలో అందుతుందన్నారు.

నేడు వినుకొండ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వినుకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మంగాపురనాథ్ తెలిపారు. ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల సమగ్ర అభివృద్ధిపై చర్చ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వలంటీర్లకు సన్మానం

నరసరావుపేట: ఉత్తమ సేవలు అందజేసి ప్రభుత్వం నుంచి అవార్డులు పొందిన 33వ వార్డు వలంటీర్లను ఘనంగా సన్మానించారు. మంగళవారం వార్డు సచివాలయంలో అవార్డులు పొందిన వలంటీర్లను వార్డు ఇన్‌చార్జీలు మద్రిపూడి రాంబాబు, కుప్పాల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించి వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు జీవాలు బలి

యడ్లపాడు: పిడుగు పాటుతో 9 జీవాలు మృతి చెందాయి. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన జీవాల పోషకులు మంగళవారం తమ మేకల్ని, గొర్రెల్ని తీసుకుని గ్రామ సమీపాన ఉన్న ప్రత్తిపాడు -కొప్పర్రు గ్రామల మధ్య పొలాలకు తీసుకెళ్లారు. ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. దీంతో మందలోని కొన్ని జీవాలు చీలి పొలంలోని ఓ చెట్టువద్దకు చేరాయి. ఇంతలోనే పెద్దశబ్దంతో ఆ చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు చెంతనే ఉన్న 9 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిలో యలగాల నాగ రాజుకు చెందిన నాలుగుజీవాలు, సాయిబాబు, పున్నారావు, శ్రీను, పరమేశ్వరరావు, శివకోటేశ్వరరావుకు చెందిన ఒక్కొక్కటి ఉన్నాయని తెలిపారు.

పిడుగు పాటుకు ఆవు, ఎద్దు మృతి

బొల్లాపల్లి: అకాలవర్షంతో పిడుగు పడి ఎద్దు, ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని లింగం గుంట తండాలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం తండాకు చెందిన బూక్యా బావర్షి నాయక్‌కు చెందిన ఆవు, ఎద్దులు మేతకోసం పొలం వెళ్లాయి. అదే సమయంలో ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో రెండు మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి. తన పొలంలో సంఘటన జరగటంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. వాటి వెంట ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

నాదెండ్ల: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 138 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్న విషయం విదితమే. జూన్ 1వ తేదీ వరకూ తమ లాగిన్‌లో దరఖాస్తుల సమస్యలు ఉన్నట్లయితే గ్రీవెన్స్ చేసుకోవచ్చని ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీలు పొందేందుకు 61 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. 21 మంది లాంగ్ స్టాండింగ్ కాగా, మరో 22 మంది సర్‌ప్లస్, మరో 18 మంది రిక్వెస్ట్ కేటగిరిల్లో, ఉన్నత పాఠశాల పరిధిలో 77 మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

రొంపిచర్లలో వర్షం

రొంపిచర్ల: మండలంలో మంగళవారం కూడా వర్షం కొనసాగింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 2.0 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉండి అప్పుడప్పుడు వర్షం పడింది. నిన్న మొన్నటి వరకు గ్రీష్మతాపంతో అల్లాడిన మండల ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనాన్ని ఇచ్చాయి.

నాలుగేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- జగనన్న పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ద్విచక్రవాహన ర్యాలీ
- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 300 మంది రక్తదానం
- ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో రక్తదానం చేస్తున్న దృశ్యం



రక్తశిబిరంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేటలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

నరసరావుపేట: గడిచిన నాలుగేళ్లలో ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందజేశారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సీఎం జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అట్టహాసంగా ద్విచక్ర వాహన ర్యాలీ, ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ సాయంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 300 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. జిల్లా అధ్యక్షులు కంజుల జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైద్యశాల ఆవరణలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడారు. కరోనా లాంటి ఇబ్బందులెదురైనా ప్రజలు ఇబ్బందిపడకుండా సంక్షేమ పథకాలు అందజేశారని, డీబీటీ విధానంతో రూ.2.10 లక్షల కోట్లు వారి ఖాతాల్లో జమ చేయటం జరిగిందన్నారు. 2050 విజనరీ సీఎంగా ప్రచారం చేసుకునే చంద్రబాబును రాష్ట్రానికి ఏమి చేయలేదన్నారు. సీఎం జగన్ నాలుగు పోర్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని, అందులో రామాయపట్నం పోర్టు వచ్చే డిసెంబరు నాటికి పూర్తయి ఓడలు రాకపోకలు సాగిస్తాయన్నారు. పది ఫిషింగ్ హార్బర్లు, భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన జరిగి శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు మాదిరిగా శంకుస్థాపనలతో చేతులు దులుపుకోకుండా భూసేకరణ చేసి కోర్టు అనుమతులతో పనులు చేపట్టారన్నారు. చంద్రబాబు వైజాగ్‌లో పెట్టుబడి సదస్సు నిర్వహిస్తే నరసరావుపేటకు చెందిన వ్యక్తులు కోటు వేసుకొని ఎంఓయులు కుదుర్చుకున్నారన్నారు. అదే సీఎం జగన్ సదస్సు నిర్వహిస్తే రిలయన్స్ అంబానీ, ఆదానీ లాంటి పారిశ్రామిక వేత్తలు పదుల సంఖ్యలో హాజరై రూ.11 లక్షల కోట్లకు ఎంఓయు కుదుర్చుకున్నారన్నారు. 2014లో 650 హామీలతో మానిఫెస్టో పెట్టి అధికారంలోకి రాగానే దానిని తొలగించి ఏ ఒక్కటీ అమలు చేయని వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఇప్పుడు మరోసారి దొంగ హామీలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. చంద్రబాబును ఎవరూ నమ్మబోరని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల జిల్లా పర్యవేక్షణాధికారి, వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బీవీ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల పేదలకు సేవలు అందజేయటంలో రాష్ట్రంలో మూడవ స్థానం చేజిక్కించుకుందన్నారు. 200 పడకలకు గాను 270 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారని, 60 మంది డాక్టర్లు ప్రత్యేకంగా పనిచేస్తున్నారన్నారు. ఓపీ రోజుకు 1500 మంది వరకు ఉంటుందని, నెలకు 250 వరకు డెలివరీలు అవుతున్నాయన్నారు. మే నెలలో రక్తం కొరత అధికంగా ఉంటుందని, శిబిరం ద్వారా వచ్చే రక్తంతో రోగులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం మాట్లాడుతూ చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైందని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యా, వైద్యంకు అత్యధిక ప్రాధాన్యమివ్వటం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేయటంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ ఓరుగంటి శేషిరెడ్డి మాట్లాడుతూ మొండిగోడలతో టీడీపీ నాయకులు ప్రారంభించిన వైద్యశాలకు ఎమ్మెల్యే గోపిరెడ్డి సుమారు రూ.4 కోట్ల వ్యయంతో అన్నీ మౌలిక వసతులు కల్పించారని, కోవిడ్ సమయంలో 5260 మందికి వైద్యసేవలు అందజేయటం జరిగిందన్నారు. పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ రూ.1 లక్ష వ్యయంతో ప్రభుత్వ వైద్యశాలకు బహూకరించిన ర్యాక్‌లను ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రారంభించారు. తొలుత పార్టీ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ శ్రేణుల కేరింతల మధ్య కేకును కట్ చేశారు. ర్యాలీలో తాను కూడా ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ వాహనంపై ప్రథమ శ్రేణిలో కొనసాగారు. కార్యక్రమంలో నరసరావుపేట, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబులురెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం స్వామి, చింతా కిరణ్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్, రొంపిచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ రామకృష్ణ, జిల్లా యుజవన విభాగ అధ్యక్షులు పడాల శివారెడ్డి, లైసెన్స్ అండ్ సర్వేయర్స్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మసాని కమలాకర రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినుకొండలో...



వినుకొండ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా, పార్టీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలనకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేశారని, ఒక వైపు సంక్షేమం, మరొక వైపు అభివృద్ధిని రెండు కళ్లలా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, టీడీపీ నేతలు తప్ప రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు కనీసం 2 శాతం హామీలు కూడా అమలు చేయలేకపోయారని, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డ్వాక్రా రుణమాఫీ పేరుతో ఒకసారి ప్రజలను మోసం చేసి మరోమారు మోసపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఎవరు ఎన్ని హామీలు ఇచ్చినా 2024లో కూడా అధికారం తమదేనన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని వందల కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని చెప్పారు. నాలుగేళ్ల పాటు పార్టీకి సేవలు అందించిన కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

జోరువానలో ఉత్సాహంగా బైక్ ర్యాలీ

వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా ఆధ్వర్యంలో జోరు వర్షంలో కూడా వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పురవీధుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే కూడా వర్షంలో బైక్ నడుపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ఆదర్శపాలన

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ ఒక చరిత్ర
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఆదర్శపాలన చేస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని కావూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం లభించిందో తెలుపుతూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ మన ధైర్యం, మన ఆశ, మన ధీమా అన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. పేదలు ఈ రోజున రాష్ట్రంలో ఎంతో సంతోషంగా ఉన్నారంటే దానికి కారణం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వివరించారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, చేదోడు వంటి ప్రతి పథకం సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపేదేనని వెల్లడించారు. నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారని వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులకు మహర్దశ చేకూరిందని చెప్పారు. మరోవైపు సొంత ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ జగనన్న కాలనీల ద్వారా సొంత ఇల్లు సమకూరుతుందని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి క్షణం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్నదని వివరించారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, కక్కెర శ్రీనివాసరావు, నాగబైరు వెంకట్, కందుల ఆంజనేయులు, పెడవల్లి చినబాబు, గుమ్మడిదల నాగేశ్వరరావు, జెర్రిపోతుల కరుణామయుడు, బోడియ్య, అంకమ్మ, ఇజ్రాయేలు, రమణయ్య, కందుల వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరుడి సేవలో మాజీ డిప్యూటీ స్పీకర్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మంగళవారం దర్శించుకున్నారు. సోపానమార్గం ప్రారంభంలోని సిద్ధి గణపతి స్వామికి ముందుగా పూజలు నిర్వహించి కొండపైకి చేరుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రఘుపతికి ఈవో వేమూరి గోపి, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి పంచామృత అభిషేక దర్శనంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతికి ఈవో గోపి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం, చిత్రపటాన్ని బహుకరించారు. ఎమ్మెల్యే వెంట బ్రాహ్మణ సంఘం నాయకులు ముత్తనపల్లి శివరామకృష్ణ ప్రసాద్, సతీష్, బీపీ కుమార్, శ్రీగిరిరాజు నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఆలయ సూపరింటెండెంట్ శివనాగిరెడ్డిలు పాల్గొన్నారు.

ఆంజనేయ విలాస్ నిర్వాహకుడికి డాక్టరేట్

వినుకొండటౌన్: హోటల్ నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే కాకుండా సామాజిక కార్యకర్తగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన శ్రీ ఆంజనేయ విలాస్ నిర్వాహకుడు ఇమ్మడిశెట్టి సూరిబాబును గౌరవ డాక్టరేట్ అవార్డు లభించడం పట్ల కుటుంబసభ్యులు, మిత్రులు, తోటి వ్యాపార వర్గం హర్షం వ్యక్తం చేశారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ వారు చెన్నైలో నిర్వహించిన అవార్డు ప్రధాన ఉత్సవంలో సూరిబాబుకు గౌరవ డాక్టరేట్‌ను అందజేయడం జరిగిందని కుటుంబసభ్యులు మంగళవారం తెలియజేశారు.

త్రిపురాపురం సర్పంచ్‌గా బ్రహ్మారెడ్డి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని త్రిపురాపురం గ్రామ సర్పంచ్‌గా గొట్టం బ్రహ్మారెడ్డిని ఎంపిక చేస్తూ నియామక ఉత్తర్వులను ఎంపీడీవో జిలానీబాషా మంగళవారం అందజేశారు. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అడపా రమణారెడ్డి ఒప్పందంలో భాగంగా రాజీనామా చేయడంతో నూతన సర్పంచ్‌గా బ్రహ్మారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సర్పంచ్‌లు కంచర్ల బాబు, పరిమి శేషయ్య పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమం దరిచేరాలి

వినుకొండ(నూజెండ్ల):గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని నూజెండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన నూజెండ్ల మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామసచివాలయ సిబ్బందితో పాటు అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నూతనంగా పింఛన్, రైతు భరోసా పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి సత్వరమే ఇబ్బంది లేకుండా పథకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జిలానీబాషా, తహసీల్దార్ మధుబాబులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

చిలకలూరిపేటటౌన్: బాల్య వివాహాలు పిల్లల హక్కులను ఉల్లంఘిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.సామ్రాజ్యం చెప్పారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో మంగళవారం ఆజాద్ ఎంపీపీఎస్ స్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు, ఏఎన్‌ఎంలు, మహిళా కానిస్టేబుళ్లకు బాల్య వివాహాల నిషేధం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో మహిళలకు దీర్ఘకాలిక సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలకు కారణాలైన మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ అప్పాపురం రమేష్, స్కూల్ హెచ్ఎం వి.నాగమల్లేశ్వరాచారి పాల్గొన్నారు.

వినుకొండ అభివృద్ధికి కృషి చేయాలి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పురపాలక సంఘం సమగ్ర అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ దీఈఈ వెంకయ్య ఆధ్వర్యంలో సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 24 అంశాలను చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ వినుకొండ పురపాలక సంఘం అభివృద్ధికి అధికారులు, కౌన్సిల్ సభ్యులు కలిసికట్టుగా కృషి చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో వినుకొండలోని 4వ వార్డు శ్రీనివాసనగర్‌లో సైడ్ డ్రెయిన్ నిర్మాణంతో పాటు తిమ్మాయపాలెం రోడ్డులో ఎంఎల్‌టీ ఫిల్టర్ ప్లాంటేషన్, క్లోరిన్ గ్యాస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పట్టణంలో వర్షాలకు పాడైన సీసీ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు, పారిశుధ్య పనులు, అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, నిరుపయోగంగా ఉన్న ఇనుము, ఇతర వస్తువులు బహిరంగ వేలం వేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. అలాగే కౌన్సిల్ సభ్యులు సభ దృష్టిలో ఉంచిన విద్యుత్ సరఫరా, శానిటేషన్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీకి సహకరించొద్దు

బొల్లాపల్లి: నాటుసారా తయారీకి ఉపయోగించే వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ వ్యాపారులను హెచ్చరించారు. బండ్లమోటు పోలీస్ స్టేషన్‌లో వ్యాపారులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారా తయారు చేయడానికి వినియోగించే నల్ల బెల్లం ఎక్కువ మొత్తంలో అమ్మరాదన్నారు. నాటుసారా మినహాయించి ఇతరత్రా వినియోగానికి తక్కువ మొత్తంలో అమ్మకోవాలని సూచించారు. మండలంలోని వెల్లటూరు, రావులాపురం, బొల్లాపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 15 మంది వ్యాపారులకు నాటుసారా తయారీ నిషేధం గురించి వివరించారు.

జగనన్న నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శం

శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి. పక్కన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలన దేశానికి ఆదర్శమని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అన్నారు. వినుకొండలో కోదండ రామాలయం పునఃప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఆయన స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కులం, మతం, ప్రాంతం బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేశారని, కరోనా సమయంలో ప్రపంచమే వణికిపోతున్న సమయంలో కూడా రెండేళ్ల పాటు ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని ఆయన అభినందించారు. వినుకొండకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం చేయడంతో పాటు రామలింగేశ్వర స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి భేష్‌గా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా స్పీకర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సివిల్స్‌లో స్థానం

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన
- జెడ్డావారి పాలెంలో పర్యటన



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

వినుకొండ(నూజెండ్ల): ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే సివిల్స్‌లో స్థానం సంపాదించవచ్చని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. నూజెండ్ల మండలం జెడ్డావారిపాలెం గ్రామంలో పారా లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నిర్వాహకులు పారా లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఇటీవల యూపీఎస్సీలో 462 ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు సెలక్ట్ అయిన వినూత్న అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శివశంక్ పాల్గొని వినూత్నను అభినందించారు. స్టడీ సర్కిల్ నిర్వాహకులు పారా లక్ష్మయ్యకు కూడా అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఢిల్లీ, హైదరాబాద్‌ల్లో స్టడీసర్కిల్ ద్వారా ఎంతోమందిని ఐఏఎస్‌లను తయారు చేసిన లక్ష్మయ్య కృషి ఎనలేనిదన్నారు. గ్రామంలో సమస్యల అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.